క్లుప్తంగా

12న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

రావులపాలెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఇండో ఎంఐఎం, పానాసోనిక్, కేఐఎంఎల్, హోండాయ్ మోబిస్, ఇస్ ఫిలామ్, ఇండస్ కాఫీ కంపెనీలు, పాల్గొంటున్నాయన్నారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్, అర్హతలు కలిగి, 23 సంవత్సరాలు నుంచి 30ఏళ్ల లోపు ఉన్న అభ్యర్థులు, రేణిగుంట, శ్రీ సిటీ, అనంతపూర్, మంబట్టు, సూళ్లూరుపేటలలో టెక్నీషియన్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు 12న ఉదయం 9 గంటలకు విద్యా అర్హతుల జిరాక్స్ కాపీలు, ఐడీ కార్డులు తీసుకొని రావాలన్నారు. ఈ మేళాకు సమన్వయకర్తగా జేకేసీ కోఆర్డినేటర్ కే రజిని వ్యవహరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 7660823903, 8074734412 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి పరామర్శ


రామచంద్రరావుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: సోదర వియోగంతో బాధపడుతున్న పాశర్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు తోరం సూర్యభాస్కర్‌ను మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పరామర్శించారు. భాస్కర్ అన్నయ్య తోరం రామచంద్రరావు అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో అతని సోదరుడు భాస్కర్‌ను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు. రామచంద్రరావు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఆమె వెంట మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పార్టీ నేతలు ఉన్నారు.

ఎమ్మెల్సీగా గోపీమూర్తి విజయంపై హర్షం


ముక్తేశ్వరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అయినవిల్లి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తి అఖండ మెజార్టీతో గెలుపొందడంపై యూటీఎఫ్ అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్తేశ్వరం సెంటర్‌లో విజయోత్సవ ర్యాలీ చేశారు. బాణసంచా పేల్చారు. స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.మురుగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పి.ఎస్.నాగేంద్రరావు, గౌరవ అధ్యక్షులు జి.సాయిశ్రీనివాస్, అధ్యక్షుడు టీబీ ఈశ్వరరావు, కోశాధికారి ఎం.కిరణ్ బాబు, సంక్షేమ పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ విజయోత్సవం

మామిడికుదురు: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపీమూర్తి విజయం సాధించిన సందర్భంగా మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. అందరికీ స్వీట్లు పంచారు. దీంతోపాటు యూటీఎఫ్ వ్యవస్థాపకులు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.నాగేంద్రప్రసాద్, బాలం పెద్దిరాజు, జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు, ప్రతినిధులు కుడుపూడి సత్యనారాయణ, టీఆర్‌కే గణపతిరావు, అరవా సుబ్రహ్మణ్యం, మద్దుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు దారేదీ ?

- గ్రామాల్లో రహదారులపైనే ధాన్యం ఆరబోత
- ప్రమాదమంటున్న అధికారులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వినతి


కొత్తూరు-కడియం రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం


చింతలూరు-కపిలేశ్వరపురం రోడ్డులో ఆరబెట్టిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

ఆలమూరు: ఖరీఫ్, రబీ సీజన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా రోడ్లపై ధాన్యపు రాశులు కనిపిస్తుంటాయి. మాసూళ్లు అయిన తర్వాత రైతులు ధాన్యంలో తేమ తగ్గించేందుకు కళ్లాల్లోనూ, రోడ్లపైన ఆరబెడతారు. రైతులకు ప్రత్యామ్నాయ వసతులు లేకపోవడంతో ఎక్కువగా రహదారులపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. దీని కారణంగా రహదారులపై ప్రయాణించే వారికి, వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలోని 11 మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 58 వేల ఎకరాలు వరిసాగు జరిగింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు పూర్తి కాగా మరి కొన్ని ప్రాంతాల్లో తుది దశకు చేరుకున్నాయి. వరికోత యంత్రాల సాయంతో మాసూల్లు చేసిన ధాన్యంలో అధికశాతం తేమ ఉండడంతో ఆరబెట్టుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని రైతులు అక్కడక్కడా ఉన్న లేఅవుట్లను నియోగించుకుంటుంటే గ్రామీణ ప్రాంత రైతులకు మాత్రం రహదారులే శరణ్యమవుతున్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టుకునే విషయంలో రైతులు ప్రత్యామ్నాయాలను విస్మరించి వాహనాల రద్దీ అధికంగా ఉండే రహదారులను వినియోగించుకోవడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

రోడ్డుపై ధాన్యంతో ప్రమాదాలు

గ్రామీణ ప్రాంత రైతులకు తేమ శాతం తగ్గింపు తప్పనిసరి కావడంతో నిబంధనలు అనుమతించకపోయినా రద్దీగా ఉండే రహదారులను ఉపయోగించుకుంటున్నారు. దీనివల్ల ఇటీవల అనేక ప్రమాదాలు సంభవించి వాహనదారులు క్షతగాత్రులైన సంఘటనలు ఉన్నాయి. ధాన్యం రాశులను తప్పించే ప్రయత్నాలలో వాహనదారులు ప్రమాద బారిన పడుతున్నారు. ఆకస్మాత్తుగా మలుపులు తిప్పేస్తుండడంతో వెనుక ఉన్న వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. రోడ్డుకి ఒక వైపు ధాన్యం రాశులు వేస్తుండడంతో మిగిలిన కొద్దిపాటి మార్గంలోనే ఎదురెదురు వాహనాలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఆ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నిబంధనలు తప్పనిసరి

రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు రహదారి నిబంధనలను క్రమం తప్పకుండా పాటించాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉంది. ద్విచక్ర వాహనదారులు వేగనియంత్రణ లేకుండా వాహనాలను నడపడం వల్ల కూడా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రమాదకర మలుపులు వద్ద, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజలు కోరుతున్నారు. వంద మీటర్ల దూరం నుంచే కనిపించేటంత పరిమాణంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాల నివారణకు సత్ఫలితాలు సాధించవచ్చుననే పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు రహదారుల ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ధాన్యపు రాశులను నిల్వ చేయకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టినా లేదా రాశులుగా వేసిన ప్రమాదాలు సంభవించే అవకాశం అధికంగా ఉంది. రైతులు ఈ విషయాన్ని గమనించి రహదారులపై రాకపోకలకు ఆటంకాలు లేకుండా సహకరించాలి. రహదారుల ఆరబోత వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.అశోక్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఆలమూరు

అమ్మవారికి వెండి ఖడ్గం సమర్పణ


ఆలయంలో ఖడ్గం ప్రతిష్ఠిస్తున్న ప్రముఖులు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెంలో కొలువైన కనక ముత్యాలమ్మ అమ్మవారికి సోమవారం ఆ గ్రామానికి చెందిన దాత మేడిద విజయ మోహన్ వెండి ఖడ్గాన్ని సమర్పించారు. ఖడ్గానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు రూ.లక్ష విలువ చేసే ఈ వెండి ఖడ్గాన్ని డాక్టర్ రాపాక రమేష్‌బాబు, దాత విజయ మోహన్ ప్రతిష్ఠించారు. సర్పంచ్ మేడిద సరోజ, ఉండపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

కొత్తపేట: పారా లీగల్ వలంటీర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ జడ్జి పి.రమణారెడ్డి సోమవారం తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీల పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, గన్నవరం, ఆత్రేయపురం, మండలాల్లో పారా లీగల్ వలంటరీ పోస్టులు నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులను కొత్తపేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి అందజేయాలన్నారు.

వైభవంగా సీతారామచంద్రుల కల్యాణం

అయినవిల్లి: గ్రామంలో ఉన్న సీతా రామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సందరంగా అలంకరించారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు


మామిడికుదురులో ఫిర్యాదు చేస్తున్న పాశర్లపూడి గ్రామస్తులు

మామిడికుదురు: పాశర్లపూడి రేవులో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను నివారించాలని కోరుతూ స్థానికులు సోమవారం ఫిర్యాదు చేశారు. అమలాపురం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు, మామిడికుదురు ఎమ్మార్వో సుబ్రహ్మణ్యాచార్యులకు వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. రైల్వే బ్రిడ్జితో పాటు రోడ్డు బ్రిడ్జి ఉన్న ప్రాంతంలో ఇసుక తవ్వకాలు నిర్వహించకూడదని జీవో ఉన్నా దానికి విరుద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉచిత ఇసుక అని చెబుతున్నా దాన్ని అడ్డం పెట్టుకుని పార్టీ నేతలు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్రామ నాయకులు అధికారుల అండతో శృతిమించి ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించడంతో పాటు దీనికి మూల సూత్రదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వేగి లక్ష్మీనారాయణ, నానాజీ, బొక్కా రమేష్ తదితరులు ఉన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరించిన ప్రజా సంఘాల నాయకులు

మలికిపురం: మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల పదో మహాసభలు ఈ నెల 14, 15 తేదీల్లో అనంతపురంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా మలికిపురం అంబేడ్కర్ సామాజిక భవనం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక సభ్యులు జనిపల్లి నాని, ముత్యాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఈ మహాసభలో కులగణన ఎందుకు అవసరం, బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు, ఎన్‌ఈపీ–2020 కాషాయికరణ–కార్పొరేటీకరణ అంశాలపై ప్రసంగాలు ఉంటాయి. ఈ మహాసభలను విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో చవ్వాకుల వెంకట్, గెడ్డం రేచల్ జ్యోతి, బీఎస్పీ నాయకులు ఆకుమర్తి భూషణం, చైతన్య సమితి కార్యవర్గ సభ్యులు గెడ్డం బాలరాజు, జామా మజీద్ ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్దుల్ రహీం, మహమ్మద్ షాబా మాస్టర్ పాల్గొన్నారు.

డాక్టర్ లీజర్ జీవితం.. వైద్యానికి అంకితం


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అంబాజీపేట: స్థానిక స్త్రీల ఆసుపత్రి వ్యవస్థాపకురాలు డాక్టర్ ఐరేనీ లీజర్ జీవితం వైద్యానికే అంకితమని తమిళనాడులోని రాయ వెల్లూరుకు చెందిన డాక్టర్ రూప్ సోలమెన్ అన్నారు. డాక్టర్ లీజర్ 98వ జయంతి సందర్భంగా అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. 9 విభాగాల్లో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 195 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డా.రూప్‌సాలోమెన్ మాట్లాడుతూ 1967లో స్థాపించిన స్త్రీల ఆసుపత్రిలో ప్రస్తుతం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు పేదలకు అతి తక్కువ ధరలకే అందిస్తున్నారన్నారు. వైద్య శిబిరంలో వివిధ వైద్య కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులతో పాటు స్థానిక స్త్రీల ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఎస్.హెవార్డు రాజ్, పూర్వపు వైద్యురాళ్లు డాక్టర్ ప్రభావతి, రాజకుమారి, స్థానిక వైద్యురాళ్లు డాక్టర్ విజయ, షైనీ సరెళ్ల పాల్గొన్నారు.

సౌత్ అమెరికా నుంచి ప్రతాప్‌కు ప్రశంసాపత్రం



ఇంటర్నేషనల్ బుక్ కన్ ఫెడరేషన్ సంస్థ అందజేసిన ప్రశంసాపత్రం


కత్తిమండ ప్రతాప్

సఖినేటిపల్లి: వీవీ మెరక గ్రామానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, వర్చువల్ బుక్ ఫెయిర్ సదస్సులో సౌత్ అమెరికా దేశం నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆ వివరాలను ప్రతాప్ సోమవారం మీడియాకు తెలిపారు. ఆ దేశంలో ఈ నెల 8, 9 తేదీల్లో ఇంటర్నేషనల్ బుక్ కన్ ఫెడరేషన్ సంస్థ వర్చువల్‌గా నిర్వహించిన అంతర్జాతీయ బుక్ ఫెయిర్ సాహిత్య సదస్సులో ప్రతాప్ భారతదేశం నుంచి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతదేశ సంస్కృతి, తెలుగు సాహిత్యం గురించి ప్రతాప్ ప్రసంగించారు. అలాగే వివిధ దేశాలకు చెందిన సాహిత్య ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో ఆయనకు ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ మేరకు ఇంటర్నేషనల్ బుక్ కన్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ సీజర్ సాల్విటీరా జనంపా, కో ప్రెసెడెంట్ ఎలాన్ మొరాలేస్ సిల్వా శాంటి స్టెబాస్ నుంచి వచ్చిన పై ప్రశంసాపత్రాన్ని ఆయన అందుకున్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి


లక్కవరంలో జరిగిన సదస్సులో పాల్గొన్న ఎస్సై సురేష్, ఎంపీపీ సత్యవాణి

మలికిపురం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మలికిపురం ఎస్సై పి.సురేష్ పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆయన అధ్యక్షతన లక్కవరంలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సమావేశంలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత బానిసలు కాకుండా ఉండాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా విద్యార్థులు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలికిపురం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి లక్కవరం సర్పంచ్ కోట పుష్పకుమారి, బట్టేలంక సర్పంచ్ బోనం సీతారత్నం, కత్తిమండ సర్పంచ్ ఆరేటి రంగనాయకులు, అడవి పాలెం సర్పంచ్ కొల్లు నరసింహస్వామి, మంగెన గుర్రయ్య కళాశాల కరస్పాండెంట్ మంగిన సత్యప్రసాద్, డైరెక్టర్ నాయుడు, ప్రిన్సిపాల్ ఒ.అరుణకుమార్, డిగ్రీ ప్రిన్సిపాల్ ఒ.రాంబాబు, అధ్యాపకులు ధన, ఈజీ రాజేష్, ఓ అరుణకుమారి, ఓ నాగలక్ష్మి, ఏమల్లికార్జున్, రాహుల్, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పోలీస్ సిబ్బంది, లక్కవరం నాయకులు పాల్గొన్నారు.


రామేశ్వరంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రామస్తురాలు

సఖినేటిపల్లి: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై కే దుర్గా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రామేశ్వరంలో సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ప్రభుత్వ ఆదేశాలపై మండల స్థాయిలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, డ్రగ్స్ వాడకూడదు, దాని వల్ల జరిగే నష్టాలు గురించి ప్రజల్లో అవగాహన తేవాలని కోరారు. ఈ చైతన్యం ముందుగా వ్యక్తిగా మొదలై కుటుంబం సభ్యులకు వరకూ తీసుకువెళ్లాలని సూచించారు. ప్రధానంగా యువత పట్ల కుటుంబ సభ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా మత్తుపదార్థాలు గురించి ఏ విధమైన సమాచారం ఉన్నా పోలీసులు దృష్టికి తేవాలని, చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, తహసీల్దారు ఎం. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కే సూర్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

ఆలమూరు: రాష్ట్ర హైవే రోడ్డులోని జొన్నాడ– మండపేట రోడ్డులో సోమవారం మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.60 లక్షల వ్యయంతో సుమారు 15 కిలోమీటర్ల మేర ఈ పనులు చేపట్టారు. మరో వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్టు ఆర్‌అండ్‌బీ జేఈ వెంకట రమణ తెలిపారు.

రహదారిలో గుంతలు పూడ్చరూ..!


గుంతలమయంగా ఉన్న తొత్తరమూడి-కె.జగన్నాథపురం రహదారి

అయినవిల్లి: రోడ్డు ఎలాగో వెయ్యరు.. కనీసం రోడ్డుపై గుంతలైనా పూడ్చాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండలంలోని ముక్తేశ్వరం నుంచి కె.జగన్నాథపురం వరకూ ఉన్న బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. తరచూ వాహనదారులు ప్రమాదాలకు గుతరువుతున్నారు. 15ఏళ్లుగా రోడ్డు అభివృద్ధికి నోచు కోలేదు. గత ప్రభుత్వ హయంలో నిధులు మంజురైనా కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో రోడ్డు అభివృద్ధి జరగలేదు. దీంతో ఈ రోడ్డు మరింత దారుణంగా తయారైంది. చినుకు పడితే చాలు రోడ్డు చెరువును తలపిస్తుంది. ప్రయాణికులు ఈ రహదారి వెంటనే అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుక

మామిడికుదురు: కాంగ్రెస్ పార్టీ అధినేత, యూపీఏ మాజీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా నగరం గ్రామంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, పార్టీ సీనియర్ నేత మహ్మద్ ఆరిఫ్, పీసీసీ సభ్యురాలు దోనిపాటి విజయలక్ష్మి, పార్టీ నేతలు వానరాశి దొరబాబు, స్టాలిన్‌బాబు, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మామిడికుదురు: మామిడికుదురు మండల పరిధిలోని 18 గ్రామాల్లో మంగళవారం నుంచి జనవరి 4వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఎమ్మార్వో వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు సోమవారం తెలిపారు. పదో తేదీన బి.దొడ్డవరం, 11న నగరం, 12న మామిడికుదురు, 13న ఆదుర్రు, 17న లూటుకుర్రు, 18న పాశర్లపూడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. 19న పెదపట్నం, 20న మొగలికుదురు, 21న ఈదరాడ, 24న మగటపల్లి, 26న గోగన్నమఠం, 27న అప్పనపల్లి, 28న పెదపట్నంలంక, 31న పాశర్లపూడిలంక, జనవరి 2న కొమరాడ, 3న మాకనపాలెం, 4న గెద్దాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

సఖినేటిపల్లి: మండలంలో మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ ఆయా గ్రామ సచివాలయాలు, పంచాయతీల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సదస్సులు నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, రైతుల భూములకు సంబంధించిన మార్పులు, చేర్పులు, భూ వివాదాలు, భూ సర్వే వంటి వాటిపై రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని అన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: మండలంలో వివిధ గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో మంగళవారం నుంచి ఈ గ్రామసభలను నిర్వహించనున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామంలోనే అందుబాటులో ఉంటారన్నారు. రైతులు వివరాలను రికార్డుల్లో సరి చూసుకోవాలని, ఏమైనా తేడాలుంటే గ్రామ సభల్లో అక్కడికక్కడే పరిష్కరిస్తామని వివరించారు.

జాతీయ స్థాయి పోటీల్లో జొన్నాడ విద్యార్థుల ప్రతిభ


జొన్నాడలో పతకాలు సాధించిన విద్యార్థులను అభిందిస్తున్న స్థానికులు

ఆలమూరు: జాతీయస్థాయి కుంగ్‌ఫూ అండ్ కరాటే పోటీలలో జొన్నాడ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఈనెల ఎనిమిదిన గుంటూరు జిల్లా చిలకలూరిపేటలోని న్యూ షావులిన్ కుంగ్‌ఫూ అకాడమీ నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ జాతీయ స్థాయి పోటీల్లో స్థానిక వారియర్ మంక్స్ కరాటే విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో పతకాలు సాధించినట్టు గ్రాండ్ మాస్టర్ కే సత్తిబాబు తెలిపారు. బాలికల వైట్ బెల్ట్ విభాగంలో మేడపాటి మానస్వి రెడ్డి (గోల్డ్ మెడల్), తలంతం శ్రీమనశ్రీ (గోల్డ్ మెడల్), ఎల్లో బెల్ట్ విభాగంలో మేడపాటి గీతిక రెడ్డి (సిల్వర్ మెడల్) సాధించారు. బాలుర జూనియర్ ఎల్లో బెల్ట్ విభాగంలో వెన్నేటి కిరణ్ సంపత్ (గోల్డ్ మెడల్), ఆరంజ్ బెల్ట్ విభాగంలో సుప్రజ సాయి లక్కి (గోల్డ్ మెడల్) సాధించారు. సీనియర్స్ బ్లూ బెల్ట్ (ఏ) విభాగంలో కర్రి జై దుర్గా సాయి (సిల్వర్ మెడల్), ఎల్లో బెల్ట్ విభాగంలో డి గోవిందరాజు (గోల్డ్ మెడల్), బి.సూర్య (సిల్వర్ మెడల్), ఆరెంజ్ బెల్ట్ విభాగంలో డి.అఖిల్, బి.శంకర్ (గోల్డ్ మెడల్స్) సాధించారు. గెలుపొందిన విద్యార్థుల్ని గ్రామానికి చెందిన తాడి శ్రీనివాస్‌రెడ్డి (బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్(బాబి), నామాల సూరిబాబు, వారియర్ మంక్స్ కుంగ్ ఫ్యూ ప్రెసిడెంట్ మురళీకష్ణ, వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, కారదర్శి కే కె.సత్తిబాబు, కోచ్ పి.నానిబాబు తదితరులు అభినందించారు.

జిల్లా టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


పెదపళ్లలో ప్రమాణం చేసిన నూతన కార్యవర్గం

ఆలమూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బాలయోగి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఆలమూరు మండలానికి చెందిన జక్కంశెట్టి స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని పెదపళ్ల కల్యాణ మండపంలో జరిగిన జిల్లా టైలర్స్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ నాయకుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. జిల్లా శ్రీబాలయోగి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా జక్కంశెట్టి స్వామి (ఆలమూరు), ఉపాధ్యక్షుడిగా వాకా భాస్కరరావు (అమలాపురం), ప్రధాన కార్యదర్శిగా దొంగ సత్యనారాయణ మూర్తి (ముమ్మిడివరం), కోశాధికారిగా మట్టపర్తి రాంబాబుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ నాయకుల ఆధ్వర్యంలో నూతన జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని టైలర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. రాష్ట్ర సంఘాల పరిరక్షణ కమిటీ నాయకులు పోగుల మల్లికార్జున రావు, కడలి వెంకటేశ్వరరావు, బండారు నాగ సుబ్రహ్మణ్యం, బసవ వెంకట దుర్గారావు, పడవల సత్యనారాయణ, నేలటూరి సత్యనారాయణ, వానపల్లి ప్రసాద్, పట్నాల అంజిబాబు, లేగా సుబ్రహ్మణ్యం, పితాని రామచందర్రావు, కంద చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.